క్లుప్తంగా

మంత్రి అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న మంత్రి అమర్‌నాథ్

ఏయూ క్యాంపస్: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జన్మదిన వేడుకలను ఆదివారం ఈస్ట్ పాయింట్ కాలనీలో కార్పొరేటర్ ముప్పల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంత్రి అమర్‌నాథ్ పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రికి కార్పొరేటర్ దంపతులతో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

మరడ అప్పారావురెడ్డికి ఘన నివాళి


మరడ అప్పారావురెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఏయూ క్యాంపస్: ఇటీవల మరణించిన బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ మరడ అప్పారావురెడ్డి సంస్మరణ సభ ఆదివారం పెద వాల్తేరు జంక్షన్ గాంధీ సెంటర్‌లో జరిగింది. ఈ సందర్భంగా అప్పారావు చిత్ర పటానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు ఎం.రవీంద్ర, ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారుడు, పోలమాంబ దేవస్థానం మాజీ చైర్మన్ మద్ది వెంకట శ్రీనివాసరెడ్డితో పాటు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అలరించిన సంగీత విభావరి

మద్దిలపాలెం: కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. సంగీత సాయి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ గాయనీ, గాయకులు చక్కని గీతాలతో మైమరిపించారు. కీ బోర్డుపై సోమేష్, రాంబాబు, తబలాపై ఏవీ చలం, అప్పలరాజు, ఫాడ్స్‌పై నానీ, జాజ్‌పై పైడిరాజు సంగీత సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో నాంచారయ్య, ఆశామధు, తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ ఆత్మహత్య!

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

పరవాడ: దేశపాత్రునిపాలెంలో నివసిస్తున్న లారీ డ్రైవర్ దెందుకూరి శ్రీనివాసరాజు (40) సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. పరవాడ సీఐ ఈశ్వరరావు అందించిన వివరాలు.. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వేంపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసరాజు భార్య, ఇద్దరు పిల్లలు, తల్లి అప్పలనర్సమ్మతో కలిసి దేశపాత్రునిపాలెంలో కొంత కాలం నుంచి నివాసం ఉంటున్నాడు. శ్రీనివాసరాజు భార్యా పిల్లలతో శనివారం ఉదయం యారాడ బీచ్‌కు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చారు. అనంతరం పనిచేస్తున్న ట్రాన్స్‌పోర్టు ఆఫీసుకు వెళ్లి రాత్రి ఇంటికి చేరుకున్నాడు. భోజనం చేసిన అనంతరం బెడ్ రూంలో పడుకోవడానికి వెళ్లాడు. రాత్రి 11 గంటల సమయంలో శ్రీనివాసరాజు కుమారుడు తండ్రి పడుకొన్న గది తలుపుకొట్టాడు. లోపలి నుంచి ఎటువంటి సమాధానం లేకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులు తెరచిచూడగా బెడ్‌షీట్‌తో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరిపోసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దింపి గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తీసుకెళ్లగా అక్కడ పరీక్షలు జరిపిన వైద్యులు శ్రీనివాసరాజు మృతి చెందినట్లు నిర్ధారించారు. శ్రీనివాసరాజుకు అతని భార్యకు కొంత కాలంగా మనస్పర్థలు ఉన్నాయని మృతుడు తల్లి అప్పలనర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమానాస్పద మృతిగా కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

అధ్వానంగా కైలాసగిరి పరిసరాలు


కైలాసగిరి కొండపై కేబుల్ పనుల కోసం రోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యం


రాతి శిల్పాల పార్కులోని నడక దారిలో పాడైపోయిన పలకలు

ఆరిలోవ: కైలాసగిరి పరిసరాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. వీఎంఆర్‌డీఏ నిర్వహణలో ఉన్న ఈ పార్కు అస్తవ్యస్తంగా మారడంతో సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ కొండపై నుంచి చూస్తే ఓ పక్క అందమైన నగరం, జాతీయ రహదారితో పాటు మరో పక్క ఆహ్లాదం అందించే సముద్ర తీరం, బీచ్ రోడ్డు కనువిందు చేస్తాయి. కానీ కొండపైన మాత్రం రహదారి సుమారు రెండేళ్లుగా గోతులకే పరిమితమైంది. దీనిపై కేబుల్ పనుల కోసం రోడ్డులో సగ భాగం తవ్వేశారు. ఆ పనులు పూర్తి చేయకుండా సుమారు రెండేళ్ల నుంచి వదిలేశారు. దీంతో నాలుగు అడుగులు లోతులో ఉన్న ఆ గోతుల్లో సందర్శకులు పడిపోకుండా ఇనుప స్టాపర్లు అడ్డంగా పెట్టారు. వాటి వల్ల ఆ రోడ్డు మరింత కుదించుకుపోయింది. కైలాసగిరి వెళ్లేవారు శంకు చక్రాలు నుంచి తెలుగు మ్యూజియం, జాతీయ రహదారి వైపు వ్యూ పాయింట్‌కు ఈ రహదారిపైనే వెళ్తూ ఇబ్బంది పడుతున్నారు. ఒక్కోసారి పిల్లలు ఈ గోతుల్లో పడి గాయాలపాలయవుతున్నారు. దీంతో పాటు ఇక్కడ రాతి విగ్రహాల పార్కులో సందర్శకులు నడవడానికి ఏర్పాటు చేసిన దారిపై అమర్చిన పలకలు ఊడిపోయాయి. రోడ్డు పక్కన పలు చోట్ల పిచ్చి మొక్కలు, సందర్శకులు వేసిన ఖాళీ వాటర్ బాటిళ్లతో అస్తవ్యస్తంగా మారింది. పిల్లలు ఆడుకునే మైదాన ప్రదేశాలు పలుచోట్ల గోతులుపడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడి రోడ్డుపై కేబుల్ పనులు పూర్తి చేసి, వెంటనే రోడ్డు బాగుచేయాలని, కొండపై పరిశుభ్రంగా ఉంచాలని సందర్శకులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


తీరంలోని చెత్తను సేకరించిన బ్యాంకు సిబ్బంది

బీచ్ రోడ్డు: కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పక్కరూ సహకారించాలని జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు కోరారు. ఆదివారం బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో సాగరతీరంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ బీచ్ వరకు సాగిన ఈ కార్యక్రమాన్ని రాజాబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ వై.వి.ఎస్.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పార్కులో కొత్త భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు లాసన్స్‌బే కాలనీ బాలభవన్ పార్కులో కొత్తగా సెక్యూరిటీ సిబ్బందికి ఉపయుక్తంగా నిర్మించిన భవనాన్ని మేయర్ జి.హరివెంకటకుమారి ప్రారంభించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలుపుకొంటూ కార్పొరేటర్ ముప్పల లక్ష్మి తన సొంత నిధులు వెచ్చించి ఈ భవనాన్ని నిర్మించారు. లాసన్స్‌బే కాలనీలోని క్వాడ్రేంగిల్ రెసిడెంట్స్ పార్క్ అసోసియేషన్ సభ్యులు సైతం భవన నిర్మాణానికి కొంత సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, ముప్పల సురేష్, పాల్గొన్నారు.

ఉక్కు సంకల్పంతో ప్రజాగర్జన


గంగవరంలో పాదయాత్ర చేస్తున్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాల్లో భాగంగా ఈ నెల 30న ఉక్కునగరం తృష్ణా మైదానంలో నిర్వహించనున్న ఉక్కు ప్రజా గర్జనను విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. గర్జన సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం ఉదయం గంగవరంలో, సాయంత్రం నడుపూరు రామాలయం నుంచి మహా పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ఎలా ప్రైవేటుపరం చేస్తారని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ కోసం ఎంతోమంది ఇళ్లు, భూములు ఇచ్చారని, వారి త్యాగాలను వృథా కానీయమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఉక్కు సంకల్పంతో చేపట్టిన ప్రజా గర్జనకు నిర్వాసితులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రజా గర్జనతో కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామన్నారు. 710 రోజులుగా ఉద్యమాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. అనంతరం విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలతో హోరెత్తించారు.

సమాచారమ్

వారాంతంలో ఆర్కే బీచ్ నుంచి ఆరిలోవకు సిటీ బస్సులు

ఆరిలోవ: వారాంతంలో ఆర్కే బీచ్ నుంచి ఆరిలోవ, రవీంద్రనగర్ ప్రాంతాలకు సాయంత్రం సమయాలలో పెదవాల్తేరు డిపో నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేకంగా సిటీ బస్సులు నడుతున్నారు. ప్రతి ఆదివారం సాయంత్రం నడిచే ఈ సర్వీసుల సమయాలను వాల్తేరు డిపో మేనేజర్ కె.సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాలలో రద్దీని బట్టీ ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. సాయంత్రం 3, 3.45, 4.15, 4.45, 5.30, 6 గంటల సమయాలలో డెయిరీ ఫారం దరి రవీంద్రనగర్ నుంచి ఆర్కే బీచ్‌కు బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. తిరిగి ఆర్కే బీచ్ నుంచి సాయంత్రం 4, 4.45, 5.15, 5.45, 6.30, 7 గంటలకు రవీంద్రనగర్‌కు బయలుదేరుతాయన్నారు.

– ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ నుంచి సాయంత్రం 3.20, 4, 4.30, 5, 5.50 గంటలకు ఆర్కే బీచ్‌కు బస్సులు బయలుదేరుతాయన్నారు. తిరిగి ఆర్కే బీచ్ నుంచి సాయంత్రం 4.10, 5, 5.30, 5.55, 6.50 గంటలకు ఆరిలోవకు సిటీ బస్సులు బయలుదేరుతాయని పేర్కొన్నారు. ప్రతి ఆదివారం ఆర్కే బీచ్‌కు వెళ్లాల్సిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇస్కాన్‌లో ఘనంగా పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీ రాధాదామోదరులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజలు చేశారు. హరే రామ హరే కృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కుంచె కదిలే.. ఉపాధి దొరికే..!

- గోడలపై చిత్రాలు గీస్తూ పెయింటర్లు బిజీబిజీ
- గ్లోబల్ మీట్, జీ – 20 సదస్సుకు నగర సుందరీకరణ




నగర గోడలపై ఆకట్టుకుంటున్న సందేశాత్మక చిత్రాలు

డాబాగార్డెన్స్: దశాబ్ద కాలంగా పూట గడవని పెయింటర్లకు ప్రస్తుతం మూడు పూటలా తిండి దొరుకుతోంది. ఈ ఏడాది మార్చి నెలలో రెండు అంతర్జాతీయ సదస్సులు నగరంలో జరగనున్నాయి. మార్చి 2, 3 తేదీల్లో విశాఖలో గ్లోబల్ మీట్ నిర్వహించనున్నారు. అదే నెలలో 28, 29 తేదీల్లో జి – 20 సదస్సు జరగనుంది. ఆ సదస్సులు విజయవంతం చేసేందుకు జీవీఎంసీ నడుం బిగించింది. అందులో భాగంగా విశాఖలో సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. నగరంలోని ప్రధాన జంక్షన్లు, ప్రధాన రోడ్లకి ఇరువైపులా సందేశాత్మక చిత్రాలు, ఆంధ్రప్రదేశ్ సంస్కృతిని ప్రతిబింబించే చిత్రాలు, పర్యావరణ పరిరక్షణ, చిన్నపిల్లలు ఇష్టపడే జంతువుల బొమ్మలు, ఆధునిక విధానాలు, ప్రముఖుల చిత్రాలు వేయించేందుకు జీవీఎంసీ యంత్రాంగం సిద్ధమైంది. ప్రస్తుతం గోడలపై చిత్రాలు గీయాల్సి రావడంతో అధికారులు ఈ కళా నైపుణ్యం ఉన్న వారిని వెతికి మరీ తీసుకొచ్చి బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఫలితంగా పెయింటర్లు, చిత్రకారులకు ఉపాధి దొరికింది. గతంతో పోలిస్తే శాస్త్ర సాంకేతిక రంగం అభివృద్ధి చెందడంతో పెయింటర్లకు పని లేకుండా పోయింది. అత్యాధునిక పరికరాలు వచ్చేయడంతో పెయింటర్ల వ్యవస్థ కనుమరుగైంది. ఆ వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారు కూలీ పనులకు వెళ్లిపోయారు. ఈ క్రమంలో విశాఖలో అంతర్జాతీయ సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో పెయింటర్లకు చేతినిండా పని దొరికి కుంచె కదలడంతో ఉపాధి దొరుకుతోంది.


గోడలపై బొమ్మలు వేసేందుకు సిద్ధమవుతున్న పెయింటింగ్ చిత్రకారులు

‘పాత ఆట వస్తువుల స్వీకరణ’ పోస్టర్ ఆవిష్కరణ


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సోము వీర్రాజు, జీవీఎల్, తదితరులు

ఎంవీపీ కాలనీ: పాత ఆట వస్తువుల స్వీకరణకు సంబంధించిన పోస్టర్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఆదివారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలోని పాత ఆట వస్తువులను సేకరించి అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసే కార్యక్రమానికి బీజేపీ శ్రీకారం చుట్టిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల మానసిక ఉల్లాసం, క్రీడా ప్రోత్సాహం కోసం సేకరించిన ఆట వస్తువులను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్సీ మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

సజావుగా పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష


హాల్ టికెట్లు పరిశీలించి పంపుతున్న పోలీసు అధికారి


అభ్యర్థిని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏయూ క్యాంపస్: కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకానికి ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్, ఆర్ట్స్, సైన్స్, ఫార్మసీ, న్యాయ కళాశాలల్లోని పలు పరీక్ష కేంద్రాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులు కేంద్రాలకు చేరుకున్నారు. వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాత పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. విద్యార్థుల వెంట హాల్‌టికెట్ మినహా ఎటువంటి వస్తువులు అనుమతించలేదు. విద్యార్థులు తమ వెంట తెచ్చిన సెల్‌ఫోన్, పర్స్ వంటివి పరీక్ష కేంద్రం బయట వదిలి వెళ్లారు. చివరి నిమిషం వరకు అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవడం కనిపించింది. చివరి నిమిషంలో ఆలస్యం అవుతుందనే భయంతో కొంత మంది అభ్యర్థులు పరుగులు పెట్టారు.

పరీక్ష కేంద్రాల వివరాలు వంటివి తెలియజేయడానికి పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అభ్యర్థులకు అవసరమైన సమచారాన్ని అందిస్తూ వారికి మార్గనిర్దేశం చేశారు. హాల్ టికెట్‌తో ఆధార్ కార్డ్ సరిపోల్చి చూసిన తరువాత మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. మహిళా కానిస్టేబుళ్లు అభ్యర్థినులను తనిఖీ చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు తమ వెంట తెచ్చుకున్న బ్యాగ్‌లు, పుస్తకాలు, సెల్‌ఫోన్‌లు, పర్స్‌లు వంటివి వాటిని కేంద్రాల బయట, చెట్లకు తగిలించి పరీక్ష రాయడానికి వెళ్లారు. వాటికి అభ్యర్థుల వెంట వచ్చిన వారు, పోలీసులు భద్రత కల్పించారు.

నేటి నుంచి లలితా పీఠంలో 74వ బ్రహ్మోత్సవాలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఈవో శశిభూషణ్, రమేష్‌శర్మ, కృష్ణసేన్ తదితరులు

సీతంపేట: కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి వారి 87వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23 నుంచి ఫిబ్రవరి 5 వరకు విశేష పూజా కార్యక్రమాలు, చతుర్ధ శామ్నిక అష్టముఖ గండ భేరుండ జ్వాలా నారసింహ సుదర్శన మహాయాగం నిర్వహించనున్నట్టు పీఠం సీఈవో మోచర్ల శశిభూషణ్ తెలిపారు. సంబంధిత కరపత్రాలను ఆదివారం లలితా పీఠం దర్బారు హాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠం వేద పండితుడు మాచవోలు రమేష్‌శర్మ మాట్లాడుతూ స్వామి జన్మదినోత్సవం సందర్భంగా లోక కల్యాణార్థం, ధర్మ రక్షణార్థం విశేష పూజలు, లలితా పీఠం 74వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11 రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 23వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు లలితా పీఠంలో జరగనున్న స్వామివారి జన్మదినోత్సవ సభలో కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి పాల్గొంటారని చెప్పారు. 26న వసంత పంచమి సందర్భంగా లలితా అమ్మవారికి సరస్వతి అలంకారం, సరస్వతి హోమం, విద్యార్థులకు ప్రసాద వితరణ చేస్తామని తెలిపారు. ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం లలితాకామేశ్వరుల కల్యాణం, 4వ తేదీ సాయంత్రం లలితా అమ్మవారి గ్రామోత్సవం, 5వ తేదీ ఉదయం కాళీకాలభైరవ ప్రతిష్ట జరుగుతుందన్నారు. ఈ నెల 24 నుంచి 30 వరకు ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిచే భాగవత సప్తాహప్రవచన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. సమావేశంలో సిద్ధేశ్వరీ పీఠం అడ్వైజర్ మునికృష్ణ, లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ పాల్గొన్నారు.

అనువాద సాహిత్యం ఆహ్వానించాలి


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు

సీతంపేట: ప్రజా జీవన సంఘర్షణ, విధానాలు తెలుసుకోవాలంటే అనువాద సాహిత్యం తప్పక ఆహ్వానించాలని సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు అన్నారు. అనువాద రచయిత పారనంది నిర్మల తెలుగు నుంచి హిందీలోకి అనువదించిన స్పర్శ్ కథల సంపుటి, వీరేశలింగం సమకాలీన సమాజ్ పుస్తకాలను ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆయన ఆవిష్కరించారు. రచయిత నిర్మల మాట్లాడుతూ ప్రపంచపు ఉత్తమ సాహిత్యమంతా అనువాదాల రూపంలోనే వెలువడుతోందన్నారు. విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగన సభకు అడపా రామకృష్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మేడా మస్తాన్‌రెడ్డి, శిరేల సన్యాసిరావు, సర్వేశ్వర శాస్త్రి, సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చనసేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టంపజేసి 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, శ్రీకాంతాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

విశేషంగా గరుడసేవ

వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై వేంచేయజేశారు. అష్టోత్తరశతనామావళి పూజ అనంతరం భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

వైభవంగా నిత్యకల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

డాబాపై నుంచి పడి వ్యక్తి మృతి

మల్కాపురం: మద్యం తాగి ఉన్న ఓ వ్యక్తి రెండంతస్తుల డాబా పైనుంచి జారి పడి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా.. 58వ వార్డు శ్రీహరిపురం పాత రామాలయం వీధిలో తిట్టి శ్రీను(35) అనే వ్యక్తి తన భార్య, పిల్లలతో కలిసి కొన్నేళ్లుగా నివాసముంటున్నాడు. ఓ ప్రైవేట్ సంస్థలో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి ఫుల్‌గా మద్యం తాగి ఉన్న శ్రీను తను ఉంటున్న రెండు అంతస్తుల డాబాపై నుంచి కిందకు తొంగి చూసేసరికి అదుపు తప్పి పడిపోయాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయమైంది. వెంటనే బంధువులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అప్పటికే శ్రీను మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించడంతో జరిగిన సంఘటనపై మృతుడి భార్య మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలానికి సీఐ లూథర్ బాబు, సిబ్బంది వెళ్లి విచారించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సబ్ ప్లాన్ పొడిగింపు హర్షణీయం

బీచ్ రోడ్డు: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను పదేళ్ల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ 2013 చట్టం ఈ ఏడాదితో ముగియనుంది. దీనిని మరో 10 ఏళ్ల పాటు పొడిగిస్తూ సీఎం వైఎస్ జగన్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన దళితుల పక్షపాతి అని రుజువైందని పేర్కొన్నారు.